క్లుప్తంగా

మాజీ మంత్రి వసంతకుమార్‌కు నివాళి

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ సంతాప సభను బుధవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులు పలువురు వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసిన మంత్రి వసంతకుమార్ లేని లోటు తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ వెంకన్నబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, అంబటి గాంధీ, చిలుకూరి చంద్రం, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, దప్పసాని రాంబాబు, జిత్తుక శ్రీను, బండారు కాశి తదితరులున్నారు.

నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలి

టి.నరసాపురం: కృష్ణాపురం, పుట్రేవు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం, రాజులగూడెం గ్రామాలను కలిపి నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. దీనిపై తహసీల్దార్, సర్పంచ్ తదితరులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామాలు ప్రస్తుతం టి.నరసాపురం పంచాయతీలో ఉన్నాయన్నారు. ఈ ఆరు గ్రామాలను కలిపి నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. భూక్యా వేణుగోపాల్, కుంజా కిరణ్, పండు వీరభద్రుడు, భూక్యా సురేష్, జి.చందు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డికి ప్రశంసాపత్రం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం సమీపంలోని అంతర రాష్ట్ర చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్. మణికంఠరెడ్డి ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అంతర రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విధి నిర్వహణలో నేరాలను అరికట్టేందుకు తన వంతు కృషి చేస్తున్న మణికంఠా రెడ్డి వరుసగా మూడుసార్లు ఉత్తమ ప్రశంసాపత్రాలను అందుకున్నారు. మణికంఠరెడ్డి మాట్లాడుతూ తనకు లభించిన గౌరవంతో మరింత బాధ్యతగా పనిచేస్తూ నేరాలను అరికట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఉత్తమ ప్రశంసాపత్రాలను అందుకున్న సీఐ మణికంఠారెడ్డిని పలువురు అభినందించారు.

దౌర్జన్యంపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తమను బెదిరిస్తున్నారని ముత్యాల సుబ్బారావు, ముత్యాల సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన సుబ్బారావు, సత్తిబాబుకు పట్టణ పరిధిలో 5.01ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో 4.22 భూమిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నెల 6న పి.ఆదిలక్ష్మి, ఎం.గంగమ్మ, ఎం.లక్ష్మి, కె.సుబ్బారావు, కె.తిరుపతయ్య, కె.వెంకటేష్, కె.చిన్న, ఎం.శ్రీను, మరికొంతమంది కలిసి సాగుభూమిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేశారన్నారు. ఎవరైనా అడ్డు వస్తే చంపుతామని, అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొండపైన మాధవ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరగనుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు పాల్గొంటారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

దేవస్థానం బోర్డు చైర్మన్‌గా రాంబాబు

కామవరపుకోట: రావికంపాడులోని సీతారామ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మల్లిశెట్టి రాంబాబు నియమితులయ్యారు. కంభంపాటి ప్రసన్న వీరమల్ల లక్ష్మీకాంతం, స్వర్ణ, శ్రీమన్నారాయణ, రామచంద్రరావు, రజిని, ముత్యాలరావు బోర్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజాకు బోర్డు సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధి సహకరించాలని, ప్రజలు సకాలంలో పనులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పి.భవానిప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఛైర్‌పర్సన్ బత్తిని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో పన్నులు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో వివిధ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పారిశుద్ధ్య, నీటి సరఫరా విభాగాల కార్మికులకు వేతన చెల్లింపులు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతుల కల్పన, విద్యుత్ ఛార్జీలు చెల్లింపు తదితర కార్యక్రమాలకు పన్నుల ఆదాయం అవసరమని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇళ్లు, కుళాయి, తదితర పన్నులు వెంటనే చెల్లించాలని కోరారు. డిసెంబర్ 31 నాటికి ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పన్నులు చెల్లించవచ్చన్నారు. ఆ తర్వాత చెల్లించే పనులకు రెండు శాతం అపరాధ రుసుము విధిస్తామన్నారు. మార్చి 31 తర్వాత చెల్లించే పన్నులకు భారీగా పెనాల్టీలు విధిస్తామని తెలియజేశారు.



మాట్లాడుతున్న కమిషనర్ పి.భవానీ ప్రసాద్, చిత్రంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి

మొండి బకాయిదారులపై చర్యలు

జంగారెడ్డిగూడెంలో పన్నులు చెల్లించని మొండిబకాయి దారులను గుర్తించామన్నారు. ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చామన్నారు. కొంతమందికి రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు. పన్నుల విషయంలో వారి నుంచి సరైన స్పందన లేకపోతే మౌలిక అవసరాలైన మున్సిపల్ సేవలను నిలుపుదల చేయడంతో పాటు, విద్యుత్ సర్వీసులు సైతం నిలిపివేసేందుకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటికీ వారి నుంచి సరైన స్పందన లేకపోతే జప్తు నోటీసులు ఇస్తామన్నారు. జంగారెడ్డిగూడెంలో మొత్తం 7వేలు కుళాయి కనెక్షన్లు ఉన్నాయన్నారు. అనధికారికంగా సుమారు 1,700 కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ నోటీసులు ఇచ్చామన్నారు. అనధికారి కుళాయిలను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చామని తెలిపారు. ప్రకటనలకు సంబంధించి ఒక బోర్డు వరకు అనుమతి ఉందని, ఆపై ఏర్పాటు చేసుకోవాలంటే సచివాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి, నిర్దేశించిన పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రకటనల బోర్డులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రమాణాలు పాటిస్తూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనధికారికంగా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు. పన్నులు ఎక్కువగా వచ్చినట్లుగా భావిస్తే సచివాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

పూర్తయిన ఇంటికి పన్ను

ఇళ్లు నిర్మించుకున్న వారు నిర్మాణాలు పూర్తయితే వెంటనే ఇంటి పన్నులు వేయించుకోవాలన్నారు. లేని ఎడల సంబంధిత అధికారుల తనిఖీల్లో ఇంటి పన్నులు లేనట్లుగా గుర్తిస్తే భారీ జరిమానాలతో పన్నులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ప్రజలు సహకరించి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సమష్టి కృషి

కొయ్యలగూడెం: రాష్ట్ర ప్రభుత్వానికి సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, సిబ్బంది నాలుగు స్తంభాల వంటి వారిని సమష్టిగా అభివృద్ధిలో కీలక భాగస్వాములం కావాలి అని జగనన్న మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ (మండల సచివాలయాల కన్వీనర్) నూకల రాము పేర్కొన్నారు. కొయ్యలగూడెం టౌన్ పరిధిలోని నాలుగు సచివాలయాల సిబ్బందితో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సచివాలయాల కన్వీనర్ల విధివిధానాలు గృహసారథుల బాధ్యతలను ప్రజాప్రతినిధులు పార్టీ నేతలు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాము మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేయడంలో నాలుగు స్తంభాలుగా నిలిచిన మనది కీలక భూమిక కానుందన్నారు. మన సచివాలయ వ్యవస్థ దేశానికి దిక్సూచిగా నిలిచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గర్వకారణంగా నిలవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, టౌన్ కన్వీనర్ శంకు కొండ, ఎంపీటీసీ చింత శ్రీదేవి, పార్టీ నాయకులు మారిశెట్టి శ్రీను, నిక్కర్ నాగేశ్వరరావు, కొల్లూరు యశ్వంత్, పూలపల్లి రవి, త్రినాథ్ పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

జంగారెడ్డిగూడెం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యశాఖాధికారులు అన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు పలు అభివృద్ధి అంశాలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ సభ్యులు మాట్లాడుతూ హెచ్‌డీఎస్ చైర్మన్, ఎమ్మెల్యే వీఆర్ఎలీజా ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా మార్చురీ నిర్మాణం కోసం దాతల నుంచి విరాళాల సేకరణ, ధోబీ ఘాట్ ఏర్పాటుకు మండల, పట్టణ రజక నాయకులు, పెద్దలు సహకారం తీసుకోవడం తదితర అంశాలను తీర్మానం చేశారు. ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలు ప్రజలందరూ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు వైద్యాధికారులను కోరారు. ప్రతి విభాగం వైద్యులు అందుబాటులో ఉంటున్నారని, వారి సేవలు ప్రజలు వినియోగించుకునేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో హెచ్‌డీఎస్ మెంబర్లు సూపరింటెండెంట్ బేబీ కమల, భావనరుష, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చెన్నకేశవులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సామ్రాజ్యం, హెడ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తులకు మెరుగైన సేవలందించాలి

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు భక్తులనే భగవంతుడిగా భావించి వారికి మెరుగైన సేవలు అందించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దుశ్శాలువాను కప్పి, పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ దేవుడికి, భక్తులకు సేవచేసే భాగ్యం అందరికీ దక్కదన్నారు. అటువంటి అదృష్టాన్ని పొందిన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు భగవంతుడు, భక్తుల సేవలో తరించాలన్నారు. అనంతరం గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన ట్రస్ట్ బోర్డు సభ్యుడు తానంకి గంగరాజు, బుచ్చింపేటకు చెందిన ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పాయం మంగతాయారు ఎమ్మెల్యే తలారిని కలిసి, పూల బొకేలను అందించారు.



ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు బొకే అందజేస్తున్న ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు పద్మ, జ్యోతి శ్రీనివాస్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



చింతలపూడిలో కలిసిన 1968-69 బ్యాచ్ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 1968-69 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేశంలోని విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై పట్టణాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడం విశేషం. తాము పాఠశాలలో చదివిన రోజులను బాల్య స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను నెమరు వేసుకుని మధురానుభూతి పొందారు. కురిశెట్టి తిలక్ అధ్యక్షత వహించగా ఆకార్వేశ్వరరావు కార్యదర్శిగా వ్యవహరించారు. ఆనాడు చదువు చెప్పిన గురువుల సేవలను గుర్తు చేసుకుని మరణించిన వారికి ఘన నివాళి అర్పించారు. ఆనాటి చదువు వల్లే తామంతా ఉన్న తస్థితిలో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన బర్మా హరిబాబు, మిత్రులు కురిశెట్టి తిలక్, స్వరూప్‌ను శాలువాలతో సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తీర్మానించారు.

విగ్రహ ప్రతిష్ఠ కరపత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో పాత ఆంధ్రా బ్యాంకు వీధిలో నిర్మించిన ఆలయంలో విజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమ కరపత్రాల ఆవిష్కరణ బుధవారం నిర్వహించారు. విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 3న మహా అన్నదానం, మార్చి 4న పూర్ణాహుతి, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. శైవ క్షేత్రం పీఠాధిపతులు శివ స్వామీజీ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణ ప్రాంతంలో 100 అడుగుల డ్రెయిన్ నిర్మాణానికి వైసీపీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్ మురళీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు పీపీఎస్‌చంద్రరావు, సొసైటీ చైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు, టీపీఏ మురళి, కాలింగుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మాడ రామమోహన రావు, సభ్యుడు రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, కందులపాటి శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, పీపీ రామలక్ష్మి, ఉదయ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో విజయదుర్గ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన అశోక్, రెడ్డిగణపవరానికి చెందిన జె. నాగలక్ష్మి, నాగబాబు ద్విచక్ర వాహనాలపై వస్తుండగా గురవాయిగూడెం సమీపంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశోక్, నాగలక్ష్మి, నాగబాబుకు స్వల్పగాయాలు కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పొలంలోకి ప్రవేశించనీయకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మేడా దత్తత్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు. పితాపురానికి చెందిన మేడా దత్త త్రినాథ్ గోపాల్‌కు రామచర్లగూడెంలో ఉన్న 5.59 ఎకరాల భూమిని ఏటా కౌలుకు ఇస్తున్నాడు. అంకంపాలెంకు చెందిన యడ్లపల్లి దుర్గారావు ఆ భూమి నాది అంటూ దౌర్జన్యం చేస్తున్నాడని త్రినాథ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల నరికివేత

బుట్టాయగూడెం: రాజానగరం నుంచి ఎల్ఎన్‌డీ పేట వరకూ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ఎల్ఎన్‌డీ పేటకు చెందిన వ్యక్తి అక్రమంగా నరికి వేసి అక్రమంగా తరలిస్తున్నారని లక్ష్మీపురానికి చెందిన గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ద్వారకాతిరుమల: కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత బుధవారం మృతి చెందింది. వివరాలు ప్రకారం. ఈడే దుర్గ (37) అంజయ్య దంపతులు స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా మొబైల్ క్యాంటీన్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. శివాలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెల 31న ఉదయం వీరు ఇంటి వద్ద గ్యాస్ పొయ్యిపై నీళ్లు కాస్తుండగా, ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో దుర్గ, అంజయ్యకు తీవ్ర గాయాల య్యాయి. బంధువులు క్షతగాత్రులను 108లో తొలుత ఏలూరు అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గ మృతి చెందింది. మృతురాలి సోదరుడు ముక్కు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

మానవత ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మానవతా కమ్యూనిటీ హాలులో వాచ్ ఉమన్‌గా పని చేస్తున్న లక్ష్మీ పెద్ద కుమార్తెకు ప్రసవం సందర్భంగా వైద్య ఖర్చులకు మానవత సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. బుధవారం ఆసుపత్రికి వెళ్లి రూ.9 వేలు సభ్యులు అందజేశారు. అధ్యక్షుడు మహంకాళి రంగప్రసాద్, సభ్యులు కృష్ణమూర్తి, రామాంజనేయ రెడ్డి, యెలికే తాతారావు, త్రిపుర రమేష్, పల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉచిత యోగా శిక్షణ తరగతులు

కొయ్యలగూడెం: ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆన్‌లైన్ ద్వారా కల్పిస్తున్నట్లు కొయ్యలగూడెం యోగ ధ్యాన మిత్ర మండలి సభ్యులు ఎస్‌బీజీ శేఖర్ బుధవారం పేర్కొన్నారు. ధ్యాన ఫౌండేషన్ శ్రీ రఘు గురూజీ ఆధ్వర్యంలో 64 విడత ఆన్‌లైన్ తరగతులు పది రోజులు అందిస్తామన్నారు. ఈనెల 13 నుంచి క్లాసులు ప్రారంభమవుతున్నాయని వివరాలకు 94402 62524 నంబర్‌ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

వాహనాల బహిరంగ వేలం

ద్వారకాతిరుమల: ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాల మేరకు మండల పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. అందులో దాదాపు 38 మంది పాటదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక కేసులోని స్కూటీ, ఒక కారును రూ.1,22,000, దానికి అదనంగా 18 శాతం జీఎస్టీ రూ.21,960 కలిపి విక్రయించారు. మరో కేసులోని 11 బైక్‌లను రూ.1,05,500, దానికి అదనంగా జీఎస్టీ 12,990 రూపాయలకు విక్రయించారు. ఈ సొమ్మును ట్రెజరీకి జమ చేస్తామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వేలం నిర్వహించిన వారిలో ఎస్సై సుధీర్‌తో పాటు, మోటార్ వెహికల్ అధికారులు, తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కుకునూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మెయిన్ పరీక్షల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యేలా చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని, వెంటనే ఈ విషయాన్ని డీఎస్పీ, సీఐ, ఎస్సై దృష్టికి తీసుకురావాలని కుకునూరు సీఐ కేవీ సత్యనారాయణ బుధవారం సూచించారు. పోలీసు శాఖలో ఉద్యోగాలిప్పిస్తామంటూ గతంలో కొంతమంది మోసపూరిత చర్యలకు పాల్పడ్డారని చెప్పారు. ప్రభుత్వం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తోందని, ప్రతిభ కనబర్చిన వారికే ఉద్యోగం వస్తుందని ఆయన అన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మంగళవారం ఇందిరాగనర్‌లోని అభయాంజనేయస్వామి సన్నిధిలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని మాదాసు గీత, బాలుర హైస్కూల్లోని తలారి లక్ష్మీ, మమత వర్ధినికి సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు, కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ వారధి ట్రస్ట్ ద్వారా 18 సైకిళ్ల పంపిణీ లక్ష్యం నేటితో పూర్తయిందన్నారు. బుధవారం దాతలు పారిజాతగిరి ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, చిట్టూరి రాజ్యలక్ష్మి, దవులూరి శ్రీరాములు వితరణతో ముగ్గురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేసినట్లు చెప్పారు. సామాజికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి, హనుమాన్ శోభాయాత్ర ప్రతినిధులు ఆకుల సాంబశివరావు, ఇర్రంకి శంభుప్రసాద్, పరాంకుశం రమణబాబు, సత్యసాయి సబ్‌జోన్ కన్వీనర్ నర్రా రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలపై వినతిపత్రం

కుకునూరు: పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలోని కివ్వాక గ్రామ పంచాయతీకి సంబంధించి ఆర్అండ్ఆర్ ఇంటి విలువల పరిహారం జాబితాలో తప్పిపోయిన 109 పేర్లను చేర్చించి న్యాయం చేయాలని కోరుతూ కివ్వాక నిర్వాసితులు బుధవారం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరసింహారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి విలువలకు సంబంధించి పేపర్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో గతంలో తప్పిపోయిన పేర్లు నోటిఫికేషన్‌లో రాలేదని చెప్పారు. ఈ విషయమై గతంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన రీ సర్వే చేసి గ్రామ సభ నాటికి తప్పిన పేర్లను జత చేస్తామని, ఇప్పుడు తమ పేర్లు లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చారని తెలిపారు. కివ్వాక ఉపసర్పంచ్ బట్టు వీరబాబు, రాయి సత్యనారాయణ, వెంకన్నబాబు, ప్రవీణ్, నాగేశ్వరరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెంకి చెందిన వాసనపల్లి రాంబాబు ఈనెల 5న దేవులపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. 6వ తేదీన దేవులపల్లిలో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం రాంబాబును ఢీకొంది. ఈ ప్రమాదంలోకి రాంబాబుకి గాయాలయ్యాయి. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.